# వ్యాస కౌముది



**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

76

**తొలి మాట:** *ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక "**కౌముది**' లో ప్రచురితమైన నా 'మనభారతం' వ్యాసం జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది.* కాని సమయాభావం వల్ల జనవరి 2016 నుంచి కొన్ని బాధ్యతలవల్ల ఈ వ్యాసాలు కొనసాగించుటకు వీలు కాలేదు.

*ఇప్పుడు సమయం దొరికినందువల్ల 'కిరణ్ ప్రభ' గారి సమ్మతితో భారత విశేష చరిత్ర ను ప్రతిబింబించే ఈ 'మన భారతం' వ్యాసం ఈ సంచిక ద్వారా ఈ వ్యాసంతో మళ్ళీ కొనసాగిస్తున్నాను.*

## చేజారిన భారతదేశ రత్నరాజములు-5

### పరిటాల వజ్రం/రిజెంట్ వజ్రం



భారతదేశపు మరో అద్భుతమైన వజ్ర రాజం '**రిజెంట్ వజ్రం**' (The Regent Diamond). ఇతర వజ్రాల వలే, ఈ విలువైన వజ్రం చరిత్ర దొంగతనాలతో, హత్యలతో, కుట్రలతో, అపకీర్తిలతో, విప్లవాలతో, ఒక ప్రపంచయుద్ధంతో, శాపాలతో నిండి ఉంది.

1698 సంవత్సరంలో కృష్ణాజిల్లా, కంచికచర్ల మండలంలోని "పరిటాల" వజ్రాల గనులలో అనేకమంది పనిచేస్తున్నారు. ఒక రోజు ఔరంగజెబ్ (Aurangzeb) పాలనలోని ఒక బానిస కూలీ ఒక గనిలో త్రవ్వుతున్నప్పుడు ఒక అద్భుతమైన, 410 కారెట్ల (82 గ్రాములు) వజ్రం బయట పడింది.

ఆకాలంలో మొగల్ నవాబు ఔరంగజెబ్ (Aurangzeb) కుతుబ్ వంశాన్ని అంతం చేసి గోలకొండ సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకుని పాలిస్తున్నాడు. అప్పుడు పరిటాల కూడా గోలకొండ సంస్థానం అధీనంలో ఉంది. అందువల్ల త్రవ్వుతున్నప్పుడు బయల్పడిన వజ్రాలన్నీ గోలకొండ సంస్థానానికే చెందుతాయి. మ్రాన్పడి పోయిన ఈ బానిస తనకు దొరికిన వజ్రాన్ని ఎలా స్వతం చేసుకోవాలా అని ఆలోచిస్తూ, చివరకు తన కాలికి ఒక పెద్ద లోతైన గాయం చేసుకుని, గాయం లోపల ఈ వజ్రాన్ని దాచి కాలికి కట్లు కట్టుకున్నాడు. తన కాలికి త్రవ్వుతున్నప్పుడు గాయమయిందని అందరితో చెప్పి వెళ్ళిపోయాడు. తన ఈయుక్తి

పారినందుకు బానిస కూలీ అమిత సంతోషం పొందుతూ, ఈ వజ్రాన్ని ఉపయోగించుకుని బానిసత్వం నుంచి విముక్తి పొంది, ధనవంతుడవ్వాలనుకున్నాడు. పరిటాలనుంచి కుంటు కుంటూ దగ్గరలో ఉన్న మచిలీపట్నం వెళ్లి, చెన్నపట్నం (మద్రాసు) వెళ్లే ఒక ఓడ ఎక్కాడు.

ఆరోజులలో **కొల్లూరు-పరిటాల** గనులనుంచి బయల్పడిన వజ్రాలకు చెన్నపట్నం పెద్ద విపణి. ఈ ప్రయాణం లో ఇతని అమితోత్సాన్ని గమనించి ఓడ కెప్టెన్ ఈ వ్యక్తి కాలి గాయం లోపల ఒక వజ్రం దాగి ఉందని తెలుసు కున్నాడు. ఒకరాత్రి క్రూరుడు, ఉన్మాదుడైన కెప్టెన్ ఈబానిస వ్యక్తిని బంధించి, బలవంతంగా గాయం లోపల ఉన్న వజ్రాన్ని బయటికి తీసి, ఆవ్యక్తిని సముద్రంలోకి తోసివేశాడు.

ఓడ చెన్నపట్నం చేరిన తరువాత, ఈ కెప్టెన్ వజ్రాల బజారుకు వెళ్లి వ్యాపారి "జయచంద్"కు అయాచితం గా లభించిన ఈవజ్రాన్ని 1,000 పౌండ్ల కు అమ్మాడు. ఈ ధనాన్ని కెప్టెన్ వెంటనే విలాసాలకు ఖర్చు చేశాడు. ఆ తరువాత ఇతనికి ఒక అపరిచిత, నిరుపేద, బానిస వ్యక్తిని చంపాననే మానిసిక క్షోభ, అయాచితంగా లభించిన ధనాన్ని విలాసాలకు ఖర్చు చేశాననే బాధ, జయచంద్ తనను మోసంచేసి చాలా తక్కువ ధరకు కొన్నాడనే విషయాన్ని భరించలేక ఒక రోజు ఉరి వేసుకుని మరణించాడు.

ఆ తరువాత వజ్రాన్ని కొన్న జయచంద్ కూడా కష్టాల పాలయ్యాడు.

## పిట్ వజ్రం (Pitt Diamond)

దొంగిలించబడిన వజ్రం గురించి బయటకు పొక్కితే, దీనిని అమ్మటం, వేరే ప్రదేశానికి తరలించటం చాలా కష్టమవుతుందని జయచంద్ భావించాడు. చివరకు అప్పటి మద్రాసుకు ఈస్ట్ ఇండియా కంపెనీ (East India Company) ప్రెసిడెంట్ (President) అయిన "థామస్ పిట్" (Thomas Pitt) కు ఈ వజ్రాన్ని అమ్మాలని నిర్ధ యించుకున్నాడు జయచంద్. అప్పటికే ఇతని వద్ద దొంగిలించబడిన వజ్రం ఉందని థామస్ పిట్ కు తెలిసింది. జయచంద్ ను తన వద్దకు పిలిపించుకుని వజ్రం ఖరీదు బేరమాడటం మొదలెట్టాడు. ఈ బేరమాడే ప్రహసనం చాలా నెలలు జరింగింది. ఈ ఆలస్యం భరించలేని జయచంద్ 85,000 పౌండ్ల వెల నుంచి దిగి, చివరకు 20,000 పౌండ్లకు థామస్ పిట్ కు అమ్మాడు.

నెలల తరబడి థామస్ పిట్ ఈ వజ్జాన్ని అనైతికంగా కొనే విషయం, తరబడి జరిగిన ఈ బేరం గురించి, రాష్ట్ర మంతా, ఇంగ్లండ్ లోనూ పుకార్లు వ్యాపించాయి. ఈయన మీద ఇంగ్లడ్ లో వ్యంగ్య సంభాషణలు, పద్యాలు కూడా మొదలయ్యాయి. అప్పటికే వ్యక్తిగా, పాలకుడిగా థామస్ పిట్ కు మంచి పేరు లేదు.

ఈ వజ్రం కొనే విషయం లో అపకీర్తిని మూటగట్టుకున్న పిట్ ఈ వజ్రాన్ని తన కుమారుడు "రాబర్ట్ పిట్" తో ఈ వజ్రాన్ని కాలి బూటు (shoe)లో దాచి పంపించాడు. 1702 అక్టోబర్ 9 వతేదీన మద్రాసు నుంచి ఓడ బయలు దేరింది. ఈ కుమారుడు తండ్రి ఆదేశాల మేరకు 1704 -1706 మధ్య "Harris" అనే వజ్రాల వ్యాపారిచేత 5,000 పౌండ్లకు కోయించాడు. కోయగా వచ్చిన వజ్రపు ముక్కలతో పాటు, రజను (dust) కూడా తనకే ఇవ్వాలనే నియమం పెట్టాడు. 2 సంవత్సరాలతరువాత ఈ పరిటాల వజ్రం నుంచి ఒక పెద్ద ముక్క, కొన్ని చిన్న ముక్కలు వచ్చాయి. అద్భుతమైన కాంతిని వెదజల్లే పెద్ద ముక్క బరువు 140.5 క్యారెట్లు (28.2 గ్రాములు). పిట్ వజ్రం (పిట్ డైమండ్) గా పేరుగాంచిన ఈ వజ్రాన్ని థామస్ పిట్ తన దగ్గరే ఉంచుకుని, చిన్న వజ్రపు ముక్కలను రష్యా ను పరిపాలించే "Peter The Great" (1672 -1725) కు అమ్మాడు.

పెద్దదయిన పిట్ వజ్రాన్ని ఫ్రాన్స్ రాజు Louis XIV తో పాటు అనేక మంది యూరోపియన్ రాజ వంశజులకు అమ్మాలని ప్రయత్నించి చివరకు 1717 లో ఫ్రెంచి రాజు Louis XV పాలనా కాలంలో French Regent

Philippe II (Duke of Orl□ans) కు 135,000 పౌండ్లకు (ఇప్పటి వెల 18,840,000 పౌండ్లకు సమానం) అమ్మాడు. ఈ అమ్మకంతో థామస్ పిట్ ఆర్ధికంగా లాభ పడినా, సమాజంలో తాను మూటగట్టుకున్న అపఖ్యాతి ని మాత్రం వదిలించుకోలేకపోయాడు. అయన తరువాత అతని కుమారుడు రాబర్ట్ పిట్ ఎంత ప్రయత్నించినా తండ్రి ద్వారా తన కుటుంబానికి అంటిన అపఖ్యాతి మరకను చెరపలేక పోయాడు.

## రిజెంట్ వజ్రం

అప్పటి వరకు పిట్ వజ్రం గా పేరొందిన పరిటాల వజ్రం Regent of France కొన్నందువల్ల ఇది "Regent Diamond" (రిజెంట్/రిగెంట్ వజ్రం) గా నామాంతరం చెందింది.

1722 లో ఈ వజ్రం ఫ్రెంచ్ రాజు Louis XV కిరీటంలో అమర్చబడింది. అయన మరణానంతరం 1775 లో Louis XVI నూతన కిరీటంలో పరిటాల వజ్రం అమర్చబడింది. ఆ తరువాత అయన భార్య, ఫ్రాన్స్ రాణి అయిన "మేరీ ఏంటోనెట్టె" (Marie Antoinette) కిరీటాన్ని1791 లో ఈ వజ్రం అలంకరించింది. అప్పుడు ఈ వజ్రం విలువ 480,000 పౌండ్లగా నిర్ధారించబడింది. ఇది 2016 లో 52,980,000 పౌండ్లకు సమానం.

ఆ కాలంలో అవినీతి, అసభ్యకరమైన ప్రవర్తన, రాసలీలలలో మునిగిన ఈ ఫ్రెంచి రాణి ఫ్రాన్స్ లో జరిగిన తిరుగుబాటు ఫలితంగా 1793 అక్టోబర్ 16 వ తేదీన వధించబడింది. 9 నెలలకు ముందు ఆమె భర్త, ఫ్రెంచ్ రాజు Louis VI తిరుగుబాటు కారుల చేతిలో వధించబడ్డాడు.

1792లో ఫ్రెంచ్ విప్లవం ఉధృతంగా ఉన్నప్పుడు రాజ అంతఃపురం నుంచి అంతులేని సంపద దొంగిలించబడినది. అందులో రిజెంట్ వజ్రం కూడా ఉంది. దీనిని ఒక ఇంట్లోని అటకలో ఉన్న కలప లో దాచిపెట్ట బడింది. ఈ వజ్రాన్ని అప్పటి విప్లవ ప్రభుత్వం 1797-1798 లో తమ సైన్యం ఖర్చులకు బెర్లిన్ లోని ఒక ధనిక వ్యవస్థాపకుడివద్ద కుదువబెట్టింది. ఆ తరువాత మూడు సంవత్సరాలు (1798-1801) 'Vandenberg' అనే Dutch వ్యాపారి వద్ద మన పరిటాల వజ్రాన్ని కుదువబెట్టడం జరిగింది. 1801 లో ఫ్రాన్స్ రాజు 'నెపోలియన్-I' (Napol□on Bonaparte-I) ఈ వజ్రాన్ని విడిపించాడు.

నెపోలియన్-I ఈ వజ్రాన్ని ఇరువైపులా పదునున్నతన ఖడ్గం గుబ్బ (పిడి) లో ముగ్గురు వజ్రకారుల (Odiot, Boutet and Marie-Etienne Nitot) సహాయంతో అమర్చాడు. 1814 లో అనేక దేశాల కూటమి (Austria, Prussia, Russia, UK, Portugal, Sweden, Spain, కొన్ని German రాష్ట్రాలు) తో జరిగిన యుద్ధం లో ఓటమి పాలయిన కారణంగా పదవికోల్పోయి Elba దీవికి 1815 ఫిబ్రవరిలో పారిపోయి తల దాచుకోవలసి వచ్చింది. ఆ సమయంలో అయన రెండవ భార్య 'Marie Louise' తన స్వదేశం ఆస్ట్రియాకు పారిపోతూ రిజెంట్ వజ్రాన్ని కూడా తీసుకు వెళ్లింది. కానీ ఆ తరువాత ఆమె తండ్రి అప్పటి ఫ్రెంచ్ రాజు Louis XVIII కు తిరిగి పంపించాడు.

ఈ పరిటాల వజ్రఖచితమైన కిరీటం అయన తరువాత ఫ్రెంచ్ రాజులు Charles X (1824-1830) Napoleon III (1852-1870; Louis-Napol□on Bonaparte) కిరీటాలలో కలికితురాయిగా వెలసింది. 1852 లో నెపోలియన్ III రాజు అయినప్పుడు రిజెంట్ వజ్రాన్ని అతని భార్య Empress Eugenie కు బహూకరించాడు.

ఈమె ఫ్రెంచ్ రాజనగలను ధరించటం ఇష్టంలేక దీనిని తన గ్రీకు తలపాగా (diadem)లో పెట్టి ధరించింది. 1870 లో నెపోలియన్ III లో పదవీచ్యుతుడైన తరువాత కొత్త ఫ్రెంచ్ రిపబ్లిక్ (French Republic) 1887 లో అన్నిరాజ నగలు వేలం వేయబడ్డాయి. వీటిల్లో

రిజెంట్ వజ్రం లేదు. దీనిని వేలం వేయటానికి ఇష్టంలేక పారిస్ లోని Apollo Gallery in the Louvre లో అత్యంత విలువైన ప్రదర్శన వస్తువుగా ఉంచటం జరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధం సమయం లో జర్మనీయులు పారిస్ ధ్వంసం చేసే సమయంలో రిజెంట్ వజ్రాన్ని రాళ్లతో కప్పబడిన పెట్టెలో పెట్టి వేరొక చోట (Chambord) దాచిపెట్టబడింది. యుద్ధం తరువాత ఈ వజ్రం తిరిగి Apollo Gallery కి తరలించబడింది. ఈ రోజుకూ మనం చేజార్చుకున్న అద్భుతమైన పరిటాల వజ్రం కోట్లాది సందర్శకులను అలరిస్తూనే ఉంది.

ఒక ఏగాని సంపద కూడా పొందలేక ప్రాణాలు పోగొట్టుకున్నమన తెలుగు కార్మికుని శ్రమ ఫలితంగా ప్రపంచానికి దక్కిన ఈ అసమానమైన వజ్రం విలువ 2016 లో 61,440,000 అమెరికన్ డాలర్లుగా నిర్ధారించ బడింది!!!

(కొనసాగింపు వచ్చేనెలలో)

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS